ప్రజాశక్తి
బుధవారం 18 డిసెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



అంతర జిల్లాల డిప్యూటేషన్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిఆర్టిలను అంతర జిల్లాల డిప్యూటేషన్ పేరుతో 230 మందిని డిప్యూటేషన్ వేశారని, వెంటనే డిప్యూటేషన్లు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఐటిడిఎ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎక్కడో ఉపాధ్యాయుల లోటు ఉందని ఏజెన్సీలోని సిఆర్టిలను సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తే ఇక్కడ 10వతరగతి పరీక్షల సమీపిస్తున్న వేళ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. రంపచోడవరం ఐటిడిఎ ఎదుట సిఆర్టిలు చేస్తున్న నిరసనకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. వీరి సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో పెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, యుటిఎఫ్ నాయకులు విల్సన్ బాబు, కారం సూరిబాబు, సనాతన బాబు, వెంగళరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమరోత్సాహం



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, చిత్రంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నేతలు మంతెన తదితరులు

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ సమరోత్సాహం నడుమ మంగళవారం ముగిసింది. మహాసభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం భవిష్యత్తు పోరాటాలకు దిశా నిర్దేశం చేశారు. ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని సూచించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ముఖ్యంగా, పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారానికి, ఏజెన్సీలో రహదారులు, విద్యుత్, తాగునీరు, విద్య, వైద్యం, కమ్యూనికేషన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పనకు, జిఓ నెంబర్ 3ను పునరుద్ధరణకు, 1/70, అటవీ హక్కుల చట్టాలను పటిష్ట అమలుకు, పోడు భూములకు పట్టాలు కోసం, గిరిజనుల వ్యవసాయ, అటవీ ఫలసాయాలకు గిట్టుబాటు సాధనకు ఉద్యమించాలని మహాసభ నిర్ణయించింది. మొత్తంగా 10 అంశాలపై మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

★ సిపిఎం రంపచోడవరం జిల్లా మహాసభలో 10 అంశాలపై తీర్మానాలు
★ జిల్లా కార్యదర్శిగా బొప్పెన కిరణ్ ఎన్నిక

ప్రజాశక్తి-రంపచోడవరం, రాజవొమ్మంగి

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ రంపచోడవరంలోని ఆర్పి కళ్యాణ మండపం సీతారాం ఏచూరి ప్రాంగణం, పూనెం సత్యనారాయణ నగర్‌లో సోమ, మంగళవారాల్లో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. మహాసభ ప్రారంభ సూచికగా సిపిఎం జెండాను పార్టీ సీనియర్ నాయకులు మేకల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అమరవీరులు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, భద్రాచలం మాజీ ఎమ్మెల్యేలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, పార్టీ జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ చిత్ర పటాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.కిరణ్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం పార్టీ నాయకులు లోతా రామారావు, సీసం సురేష్, కాకా అర్జున్, కారం లక్ష్మి అధ్యక్ష వర్గంగా జరిగిన ప్రతినిధుల సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనుల హక్కులు, చట్టాలను కాపాడవలసిన ప్రభుత్వాలు వాటిని నీరుగార్చుతున్నాయని విమర్శించారు. గిరిజనుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఏజెన్సీలోని అడవులను అంబానీ, అదానీలకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాన్ని దోచుకోవడంలో అధికార, ప్రతిపక్ష నాయకులు దొందూ దొందుగానే వ్యవహరిస్తున్నారని, దొరికిన కాడికి దోచుకుంటున్నారని విమర్శించారు. బడా కార్పొరేట్ వ్యవస్థ నుండి ఏజెన్సీ ప్రాంతాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైనా ఉందని, అందుకు కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం తక్షణమే విద్యుత్ ట్రూ అప్ చార్జీల విధానాన్ని రద్దు చేయాలని, విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రంపచోడవరం ప్రాంతం పూర్తిగా వెనుకబాటుకు గురైందని, పాలకుల చిత్తశుద్ధి లోపంతో గిరిజనులు, ఇక్కడి ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, రహదారులు విద్యుత్తు వంటి అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించుకునేందుకు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.



జెండా ఆవిష్కరణ అనంతరం సెల్యూట్ చేస్తున్న పార్టీ నాయకులు, మహాసభ ప్రతినిధులు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల జీవనాధారంగా ఉన్న జీడి పంటకు మద్దతు ధరను ప్రకటించాలని, అదే ధరకు జిసిసి కొనుగోలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో వైద్యం అందుబాటులో లేకపోవడంతో పాడైపోయిన రోడ్లపై దూర ప్రాంతాలకు వైద్యం నిమిత్తం వెళ్లలేక మలేరియా, డెంగ్యు జ్వరాలతో గిరిజనులు మరణిస్తున్నారని, ఈనాటికీ డోలీల మోతలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన మంత్రులు, ఎమ్మెల్యేలు గిరిజన ప్రాంత అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించడం లేదన్నారు. గిరిజన ప్రజాప్రతినిధులు ఏజెన్సీ ప్రాంత సమస్యలపై దృష్టి సారించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వాలంటీర్లకు అభినందనలు

రెండు రోజులపాటు జరిగిన సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభను విజయవంతానికి కృషి చేసిన ఎస్ఎఫ్ఐ, ఇతర ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలకు మహాసభ తరుపున అభినందనలు తెలియజేశారు.

మహాసభ తీర్మానాలు

మహాసభ 10 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది.

1.పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి.
2. జిఓ నెంబర్ 3ను పునరుద్ధరించాలి. గిరిజన ప్రత్యేక డిఎస్సిని ప్రకటించాలి.
3.1/70, అటవీ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి.
4. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి.
5.కార్మికులకు కనీస వేతనాలు రూ 26,వేలు ఇవ్వాలి, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి.
6. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలి. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలి.
7. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలి. 200 పని దినాలు కల్పించాలి. కనీస కూలి రూ.600కు పెంచాలి.
8. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలి. విశాఖ ఉక్కుకు కడప స్టీల్ ఫ్యాక్టరీకి నిధులు కేటాయించాలి.
9. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి. మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి.
10.వలస ఆదివాసీ గ్రామాలలో మౌలిక సౌకర్యాలు మెరుగుపరచాలి. కులాన్ని నిర్ధారించి కులం సర్టిఫికెట్లు ఇవ్వాలి.

19 మందితో జిల్లా కమిటీ ఎన్నిక



కార్యదర్శి బొప్పెన కిరణ్

ఈ మహాసభలో 19 మందితో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా కార్యదర్శిగా బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా మర్లపాటి నాగేశ్వరరావు, లోత రామారావు, మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులుగా పులి సంతోష్ కుమార్, సోయం చిన్నబాబు, సీసం సురేష్, కాకా అర్జున్, ఐ.వి., మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య, మడకం నాగమణి, కొండల సూరిబాబు, ముసురు రాజేశ్వరి, ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి, కంభం శాంతిరాజు తదితరులు ఎన్నికయ్యారు.



మర్లపాటి నాగేశ్వరరావు



లోతా రామారావు



మట్ల వాణిశ్రీ



పల్లపు వెంకట్



సున్నం రాజులు



మహాసభ విజయవంతానికి శ్రమించిన వాలంటీర్లతో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డిఇఒ

టెన్త్‌లో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలి

-డిఇఒ బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-చింతపల్లి:పదవ తరగతి ఉత్తీర్ణతా శాతన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అల్లూరి జిల్లా డీఈవో పి.బ్రహ్మాజీరావు సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారులు పనసల ప్రసాద్, బోడం నాయుడు లతో కలిసి మండలంలోని వివిధ పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా బెన్నవరం ఎంపియుపి పాఠశాల, అంజలి శనివారం మినీ గురుకులం, తాజంగి కేజీబీవీ, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలలో విద్యావ్యవస్థ తీరును పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల ప్రతిభను తెలుసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థుల యాక్షన్ ప్లాన్ అమలు, ఎగ్జామ్స్ పై అడిగారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు, ఆశ్రమ వసతి గృహాల అధికారినిలు సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఇంధన పొదుపుపై ర్యాలీ

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అరకులోయ మండల కేంద్రంలోని అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక విద్యుత్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు, డిప్యూటీ ఇంజనీర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ఇంధన పొదుపుపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేయడంతో రెండు యూనిట్లు ఉత్పత్తి భారం తగ్గుతుందని చెప్పారు. వ్యవసాయం, గృహావసరాలకు సంబంధించి సోలార్ విధానాన్ని వినియోగంలోకి తెచ్చే విధంగా ప్రోమోట్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రభాకర్ రావు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా శారద వర్ధంతి



శారద చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సిఐ, గంగరాజు, ఎఇఒ

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండల కేంద్రంలోని శారద నికేతన్ పాఠశాలలో మంగళవారం శ్రామిక మహిళా నేత డి.శారద 20వ వర్ధంతిని స్కూలు ప్రిన్సిపాల్ ఎస్ చిరంజీవులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరకువేలి పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్ హిమగిరి, అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు, అరకువేలి మండల విద్యాశాఖాధికారి వి.త్రినాధరావు, శారద కుమార్తె సుమిత్ర శారద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, శారద తన జీవితమంతా పేద ప్రజలు, కార్మికులు, కర్షకుల కోసం పని చేశారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న హెచ్‌ఎన్టీసీ వర్కర్స్ హక్కులు, రక్షణ కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ఆమె గిరిజనుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. డి శారద ట్రస్ట్ పేరుతో గిరిజన ప్రాంతంలో తాగునీరు కుళాయిలు, ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర నాయకులు వివి జయ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అరుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హిమాగిరి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:విద్యార్థి దశ నుండి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అరుకు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమాగిరి విద్యార్థులను సూచించారు. మంగళవారం అరకులోయ మండల కేంద్రంలోని శారద నికేతన్ పాఠశాలలు కామ్రేడ్ డి శారద 21వ వర్ధంతి సందర్భంగా అవగాహన సదస్సులో నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి అరుకు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమాగిరి మాట్లాడారు.నేటి సమాజంలో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అంతేకాకుండా మత్తులో ఇతరుల జీవితాలు కూడా నాశనం చేసే విధంగా తప్పుడు పద్ధతిలో అవలంబిస్తున్నారన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానానికి వెళ్లాలని సూచించారు. ఆడపిల్లల పట్ల సోదర భావంతో మెలగాలని సూచించారు. రోజు రోజుకు సమాజంలో సైబర్ నేరగాళ్ళ రెచ్చిపోతున్నారని, వాటిని అరికట్టడం కోసం పోలీస్ శాఖ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. అపరిచితుల నుండి ఫోన్ కాల్స్ వస్తే రిజెక్ట్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అనంతగిరి జడ్పిటిసి డి.గంగరాజు, అరకువేలి మండల విద్యాశాఖాధికారి వి.త్రినాధరావు, శారద కుమార్తె సుమిత్ర, ప్రిన్సిపాల్ ఎస్.చిరంజీవులు, స్కూల్ కమిటీ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర నాయకులు వివి జయ,స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ

రేకుల షెడ్డులో విద్యార్థుల చదువులు



రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న పాఠశాల

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని రంగశీల పంచాయతీ ఎగరుడి గ్రామంలో జిపిఎస్ పాఠశాలలో 23 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరంతా రేకుల షెడ్డులో విద్యా భోధన చేస్తున్నారు. మూడు కిలోమీటర్లు కాలిబాటన అటవీ ప్రాంతంలో పెట్టు గోడలకు నాలుగు కిలోమీటర్ల నడిచి ఎగరుడి పాఠశాలకు వస్తున్నారు .2022-23 లో నాడు నేడు ద్వారా పాఠశాల సుమారు 25 లక్షలతో గ్రాంట్ అయినప్పటికీ భవనం పనులు మధ్యలో నిలిచి పోయాయి. పాఠశాల భవనం లేక వర్షాకాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నేలపైన కూర్చుని చదువుతున్న విద్యార్థులు

గిరిజన ఉద్యోగుల మధ్య విద్వేషాలు పెంచొద్దు

-గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన ఉద్యోగుల జీవోలను నిర్దిష్టంగా అమలు చేయాలని, ఉద్యోగుల మధ్య విద్వేషాలకు తావు లేకుండా చూడాలని గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. సీతారామరాజు జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం జరిగిన గిరిజన ప్రాంత వైద్యఆరోగ్య ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖలో తొలగించబడిన కొద్దిమంది హెల్త్ అసిస్టెంట్లు గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ల పై కోర్టులో కేసు వేయడం బాధాకరమైన విషయమన్నారు. ఉద్యోగుల నియామక ప్రక్రియ విధానాలు తెలుసుకోకుండా తప్పుడు కేసులు బనాయించడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతంలో ఇటీవల కాలంలో రెగ్యులర్ అయిన 78 మంది వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. 2003 ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం, 2003, 2006 సంవత్సరాల్లో ఉమ్మడి జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పర్యవేక్షణలో ప్రభుత్వ, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఎవరైతే ఉత్తీర్ణత సాధించారో వాళ్లకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారంగా నియామకాలు చేపట్టారన్నారు. జీవో 68 ప్రకారం గిరిజన ప్రాంతంలో నియామకాలు జరిగాయని వారు పేర్కొన్నారు. ఈ వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకోకుండా డి- మెరిట్ లో ఉండి ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్వులు ప్రకారం తొలగించబడిన కొద్ది మంది హెల్త్ అసిస్టెంట్లు 20 సంవత్సరాలుగా గిరిజన ప్రాంతంలో పనిచేసే ప్రభుత్వం దగ్గర జీతభత్యాలు తీసుకుని గిరిజన చట్టాలు హక్కులను గౌరవించకుండా గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న వారిపై తప్పుడు కేసులు బనాయించడం సరికాదని దీని మూలంగా గిరిజన ప్రాంతం, మైదాన ప్రాంతం ఉద్యోగులు అనే బేధాభిప్రాయాలు ఉద్యోగుల్లో మొదలవుతుందని, కోర్టుల్లో కేసులు వేసే ముందు పూర్తి వివరాలు తెలుసుకొని కేసులు వేసి ఉంటే బాగుండేదన్నారు. ఇది గిరిజన వైద్య ఆరోగ్య ఉద్యోగులను కించపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు కేసులు పెట్టిన ఉద్యోగస్తులపై కేసు పెట్టే ఆలోచన చేస్తున్నామని సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శెట్టి నాగరాజు, లక్ష్మణరావు గండేరు మురళి, వెంకటరమణ, రమేష్, సత్యనారాయణ, దేవి నాయుడు, మటం నాగరాజు, మోహన్ రావు, పదకొండు మండలాల ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



నోటీసులు చూపుతున్న నాయకులు, రైతులు

రైతుల షాపులు తొలగించొద్దు : సిపిఎం

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని కాశీపట్నం గ్రామంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఇరువైపులా రైతులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న షాపుల తొలగింపునకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడం పట్ల మండల సీపీఎం నేతలు ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు కిల్లో. మోస్య, ఎస్ నాగులు మాట్లాడుతూ, చిన్నపాటి దుకాణాలు నిర్మించుకొని కూరగాయలు అమ్ముకుంటూ జీవన కొనసాగిస్తున్న రైతులపై నోటీసులు జారీ చేసి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. రెవెన్యూ హక్కులు,చట్టాలను తుంగలో తొక్కి ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలు నిర్మించి కబ్జాకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో ఉత్సవాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పెద దేవుడి పండగ ఉత్సవాలను ఈనెల 22,23న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ముకుంద్, గోపాల్, మదన్ రావు తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ పండగ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు గిరిజన సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో గిరిజనులు తరలివచ్చి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విశ్వనాథం అప్పలరాజు పాల్గొన్నారు.

పెన్షనర్ల ఉద్యమకారుడు నకరాకు ఘన నివాళి

ప్రజాశక్తి -పాడేరు : పెన్షనర్ల ఉద్యమకారుడు డి.ఎస్. నకరా కు ఘన నివాళులర్పించారు. 43వ జాతీయ పెన్షనర్ దినోత్సవం సందర్భంగా స్థానిక పెన్షనర్ల భవనంలో రిటైర్డ్ ఏటిఒ నాగభూషణం రాజు, రిటైర్డ్ ఎస్ .సీ. టి అప్పారావు నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెన్షనర్లకు ఆరాధ్యుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గృహాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని 23 పంచాయితీలకు చెందిన ఆదివాసీ గిరిజన తెగలకు చెందిన వారందరికీ పిఎం జన్‌మన్ పథకానికి అనుసంధానం చేసి గృహాలు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు సుండ్రు శ్రీను మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పి వి టి జి తెగలకి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పీఎం జన్మన్ గృహాలకు ఐదు లక్షల పెంచాలన్నారు. ఇసుక ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సీనియర్ నాయకులు సొలగం గాసిరం దొర, మఠం నర్సింగరావు పడాల్, బుద్దు బిస్నాల్, కిరణ్, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న ఫాస్టర్ జాన్

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పెట్టు కోడలు గ్రామంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక గీతాలు ఆలకించారు. స్థానిక సంఘ కాపరి జాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దైవజనులు పేతురు దైవ సందేశం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రేమ, శాంతి మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు ఆనంద్, సంఘ సభ్యులు స్థానిక విశ్వాసులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని బైకిస్ట్ దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- గాజువాక : వడ్లపూడి రైల్వే వంతెనపై డివైడర్‌ను ఢీకొని పల్సర్ వాహనంపై ప్రయాణిస్తున్న, ఒక వ్యక్తి దుర్మరణం చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు పాలయ్యారు. దీనికి సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి. నర్సీపట్నం సమీపం జోగినాయుడుపాలేనికి చెందిన పోతురాజుల వరహాలు బాబు (30) బి శ్రీను ఇద్దరు ద్విచక్ర వాహనంపై వైజాగ్ వచ్చి, తిరిగి నర్సీపట్నం వెళుతన్న సమయంలో వడ్లపూడి దగ్గర డివైడర్ ఢీకొని జోగినాయుడు దుర్మరణం చెందారు. బి.శ్రీను తీవ్ర గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



చింతపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ రవికుమార్

ప్రజాశక్తి-చింతపల్లి: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ యజమానులు హక్కులు సంపాదించుకోవాలని స్థానిక తహశీల్దార్ బి.రవికుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీ కేంద్రంలో ఆ పంచాయతీ వీఆర్వో బి సోమలింగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన పంచాయతీలో భూముల రీ సర్వే, మ్యుటేషన్, భూముల సరిహద్దులు తదితర వాటిపై వచ్చిన వినతులను స్వీకరించారు. కొత్తపాలెం పంచాయతీ సచివాలయం 2లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ గిడ్డి రాజ్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి భూ సమస్యలపై వచ్చిన వినతులను సేకరించారు. ఈ విధంగా ఎర్రబొమ్మల పంచాయతీలో మ్యుటేషన్‌లకు సంబంధించి 36 వినతులు వచ్చాయని, అదేవిధంగా కొత్తపాలెం పంచాయతీలు మ్యుటేషన్‌లకు సంబంధించి 66 వినతులు, భూమి సరిహద్దులకు సంబంధించి ఒక్క వినతి వచ్చినట్లు ఈ సందర్భంగా తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ రాజకుమార్‌లు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలలో ఆయా పంచాయతీల ప్రీ సర్వే డీటీలు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

పాడేరు : రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని తహసీల్దార్ వి.త్రినాధరావు నాయుడు పేర్కొన్నారు. డి.గొందూరు, కాడెలి గ్రామాలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. భూ సమస్యలు, భూ సరిహద్దుల సమస్యలు, భూ ఆక్రమణలు, మ్యూటేషన్ల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డి గొందూరులో 55 ఫిర్యాదులు, కాడెలి గ్రామంలో 48 ఫిర్యాదులు అందాయని చెప్పారు. ప్రతి ఫిర్యాదుకు పరిష్కార మార్గం చూపిస్తామని అన్నారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ పి.పోలరాజు , ఎంపీటీసీ లక్ష్మి రామకృష్ణ పాత్రుడుపాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

సీలేరు: భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జికె వీధి తహశీల్దార్ రామకృష్ణ అన్నారు. జికె వీధి మండలం సంకాడ పంచాయతీ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యజమాని మరణానంతరం భూమి వత్తాలను భార్య లేదా వారసుల పేరిట మార్చాలంటే మ్యుటేషన్ ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. సంకడ రెవెన్యూ గ్రామంలో రైతులు నుండి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే ఆన్లైన్ చేయించడానికి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్, వీఆర్వో తరుణ్, సీనియర్ అసిస్టెంట్ చిన్నయ్య పడాల్, మండల సర్వేయర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండలంలోని పుల్లంగి పంచాయతీ గుండ్రాతి గ్రామంలో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. భూ సమస్యలపై గ్రామస్తులు దరఖాస్తులు పెట్టారు. కార్యక్రమంలో పుల్లంగి పంచాయతీ సర్పంచ్ వి జార్జి బాబు, మాజీ సర్పంచ్ ఎ మంగి రెడ్డి, ఆర్ఐ ఏసుబాబు, వీఆర్వో లచ్చన్న దొర, సిబ్బంది పాల్గొన్నారు.



సీలేరు సదస్సులో మాట్లాడుతున్న త హశీల్దార్ రామకృష్ణ



మారేడుమిల్లి మండలం గుండ్రాతిలో రెవెన్యూ సదస్సు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ప్రచార కరపత్రాలతో పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కోరెడ్ల విజయగౌరి మంగళవారం గోపాలపట్నంలో ప్రచారం చేశారు. గోపాలపట్నం పరిధిలో పలు విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయ ఓటర్లను కలిసి, పరిచయం చేసుకుని, రానున్న ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యా సమస్యలపై శాసనమండలిలో గళం విప్పుతానని, తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.

కొనసాగుతున్న ఎన్‌ఎడి కార్మికుల నిరసన

ప్రజాశక్తి -గోపాలపట్నం : తమ సమస్యలపై ఇప్పటివరకు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎడి ఉద్యోగులు, తమ ఆందోళనను ఉధృతం చేయాలని నిర్ణయించారు. మంగళవారం ఎన్ఏడి గేటు వద్ద కొనసాగిన నిరసనల్లో పాల్గొన్న ఎన్ఏడి సిఐ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాస్ ఉద్యమ కార్యాచరణను వెల్లడించారు. మంగళవారం సంతకాల సేకరణ చేపట్టిన ఎన్ఎడి ఉద్యోగులు ఈనెల 20 వరకు కొనసాగిస్తామన్నారు. ఈనెల 21న ఎన్ఏడి గేటు వద్ద దీక్షా శిబిరం వద్ద జన జాగరణ, 22న వంటావార్పులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంతకాల సేకరణకు టిఎన్‌టియుసి నేతలు సంఘీభావం తెలిపారు. భవిష్యత్తులో ఉమ్మడి ఉద్యమంలో కలిసిరావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా రుత్తల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ఏడి చరిత్రలో గతనెలలో చోటుచేసుకున్న ఘటనలు దురదృష్టకరమన్నారు. గతనెల 8 నుంచి 15 వరకు జరిగిన ఘటనలపై నిష్పక్షపాత దర్యాప్తు, కార్పొరేషనలైజేషన్ బెస్ట్ జరిపించాలని, అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఆరుగురు ఎన్ఏడి ఉద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తివేత, 36మంది సస్పెన్షన్ రద్దు, విశాఖ రక్షణ రంగం, ఇతర సంస్థలలో దీర్ఘకాలంగా అమలు జరుగుతున్నట్లు స్టోరేజ్ ఓటీ పద్ధతిని కొనసాగింపు ద్వారా 2024 సివిలియన్ సంవత్సరానికి సార్థకత చేకూర్చాలని కోరారు.

గీతంలో సిలికాన్ ల్యాబ్స్ ఇన్నోవేషన్ సెంటర్

ప్రజాశక్తి- మధురవాడ : సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు భారత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో యుఎస్‌ఎకు చెందిన బహుళజాతి సెమీకండక్టర్ తయారీ, డిజైనింగ్ సంస్థ సిలికాన్ ల్యాబ్స్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇన్నోవేషన్ ల్యాబ్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. మంగళవారం గీతం వర్సిటీ ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) ఎన్.వెంకటేష్ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా గీతం వర్సిటీ విసి ప్రొఫెసర్‌గౌతమ్‌రావు మాట్లాడుతూ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దడంతో పాటు పరిశోధనలకు గీతం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేసి, ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థలు, పరిశ్రమలతో కలిసి పనిచేస్తున్నామన్నారు. పరిశ్రమలకు గీతం అధ్యాపకులు కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నాం న్నారు. గీతంలో స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) ఏర్పాటు చేశామన్నారు.

సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) ఎన్.వెంకటేష్ మాట్లాడుతూ గీతంలో ఏర్పాటు చేస్తున్న ఐఒటి ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ల పై అధ్యాపకులకు, విద్యార్థులకు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులను సెమీకండక్టర్ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సహిస్తామన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న గీతం, సిలికాన్ ప్రతినిధులు

సెమీకండక్టర్‌ల రంగం విస్తరిస్తోందని ముఖ్యంగా పరిశ్రమలలో ఆటోమేషన్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, సెక్యూరిటి, హెల్త్‌కేర్, స్మార్ట్ సిటీలు, భద్రత అంశాలు, గృహోపకరణాలు, వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉందన్నారు. ప్రతిభ కనబరిచే విద్యార్థులకు సిలికాన్ ల్యాబ్స్‌లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తామన్నారు.కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.కె.ప్రసాదరావు, డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం ఛీఫ్ ఇన్నోవేటివ్ ఆఫీసర్ ఎన్.క్రిష్, ఇఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ భరణిచంద్ర, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధిపతి కె.ఉమాదేవి, డైరక్టర్ వంశీ కిరణ్ సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ హిమబిందు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీలేరు : సీజనల్ వ్యాధులపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని జికె.వీధి మండలం ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డీకే హిమబిందు అన్నారు. జికె వీధి మండలం దారకొండ పంచాయతీ డి.కేంటి ఈ.కొత్తూరు, పెంట్లగెడ్డ గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. రెండు గ్రామాల్లో 182 మందికి డాక్టర్ హిమబిందు సాధారణ ఆరోగ్య తనిఖీలు చేశారు. పెంట్లగొంది గ్రామంలో తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న బాలుడిని పరీక్షించి మెరుగైన చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పుల వల్ల గిరిజన గ్రామాల్లో జ్వరాలు, అతిసార, జలుబు దగ్గు చర్మ వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. రోగులు నాటు వైద్యానికి దూరంగా ఉండాలని, ఆసుపత్రికి వచ్చి మెరుగైన చికిత్స పొందాలని సూచించారు. చల్లగాలులు మంచులో తిరగకుండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఈశ్వరి, కృష్ణ కుమారి పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా రంపచోడవరం లేనోరా ఇంజనీరింగ్ కాలేజ్‌లో మంగళవారం ఇంధన పొదుపుపై అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియేల్ విద్యుత్‌ను పొదుపుగా వాడటం వల్ల ఉపయోగాలు, ఎనర్జీ ఎఫిసియెంట్ పరికరాల ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లేనోరా ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ధనరాశి గౌతమ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జునరావు, రంపచోడవరం రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.దివాకర్, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలంలోని పూజారిపాక అంగన్వాడీ కేంద్రంలోనూ, రింతాడ సచివాలయంలోనూ ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు, కొత్త ఆధార్ కార్డుల నమోదు, అడ్రస్ మార్పులు వంటి సేవలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఇఒపిడిఆర్ పాపారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు రహదారులకు రూ.30 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : రంపచోడవరం నియోజకవర్గానికి తొలి విడతగా ఏడు రోడ్ల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విజయభాస్కర్ అన్నారు. ఇందులో భాగంగా మారేడుమిల్లి నుంచి చింతలపూడి రోడ్డు వెళ్ల మార్గం 12.2 కిలో మీటర్ల మేరకు 8.55 కోట్లతో కొత్తగా తారు రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చిన్నంబాబు రమేష్, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్, టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషు కుమార్, నాయకులు పొడియం శ్రీను బాబు, బీశెట్టి అప్పాజీ, కర్రి సన్యాసి రెడ్డి, దూడ సువర్ణ కుమార్, పల్లాల రాజ్ కుమార్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షులు మల్లా దుర్గ ప్రసాద్, నాయకులు బీశెట్టి సత్య, కళ్యాణ్, బిజెపి నాయకులు భారతి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను ప్రక్షాళన చేస్తాం

రెవెన్యూ సమస్యలకు చెక్ పెడతాం

ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, విశాఖ కలెక్టరేట్

ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలూ లేకుండా అన్ని రకాల చిక్కుముళ్లను విప్పుతూ రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తామని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు చేపడతామని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సులభతర రీతిలో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగేలా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని, ఆరోగ్యకర వాతావరణంలో ప్రజలకు సేవలు అందిస్తామని అన్నారు. విశాఖలోని కలెక్టరేట్ మీటింగు హాలులో మంగళవారం జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. 22ఎ, ఫ్రీ హోల్డ్, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు, పిజిఆర్ఎస్ తదితర అంశాలపై రోజంతా సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగనుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీనిలో భాగంగా 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తోందని గుర్తు చేశారు. గతంలో 6688 గ్రామాల్లో రీ సర్వే జరిగిందని, అక్కడ కొన్ని తప్పులు దొర్లాయని వాటిని సరి చేసేందుకు వీలుగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆమోదంతో, సంక్లిష్టమైన ప్రక్రియలను సరళతరం చేస్తూ మరళా రీ సర్వేను కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. తాజాగా మరొక తొమ్మిది వేల గ్రామాల్లో రీ సర్వే చేసేందుకు ప్రణాళికలు తయారు చేశామన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తోన్న రెవెన్యూ సదస్సుల్లో సుమారు 2.80 లక్షల వినతులు వచ్చాయన్నారు. వీటిలో అధిక శాతం రిజిస్ట్రేషన్, రెవెన్యూ అంశాలకు సంబంధించే ఉన్నాయని తెలిపారు. గతంలో చేసిన రీ సర్వే ప్రక్రియలో తప్పిదాలు జరిగాయని, ఈసారి అలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహిస్తామని పేర్కొన్నారు.

విశాఖలో సమస్యలు రాకుండా చూడాలి

విశాఖ నగరం మంచి ఐటి హబ్ అని, ఇక్కడ రెవెన్యూ పరమైన సమస్యలు రాకుండా జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. ఫ్రీ హోల్డ్ విషయంలో జాగ్రత్త వహించాలని, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులభతరంగా జరిగేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.

కోర్టు కేసుల విషయంలో త్వరితగతిన స్పందించాలి : సిసోడియా

రెవెన్యూ పరమైన అంశాలు, భూముల వివాదాలకు సంబంధించి ఉన్న కోర్టు కేసుల్లో అధికారులు త్వరితగతిన స్పందించాలని, సంబంధిత చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్‌పి.సిసోడియా సూచించారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు త్వరితగతిన చర్యలు



మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

చేపట్టి నివేదించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చే వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి : ప్రజా ప్రతినిధులు

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన కాన్ఫరెన్స్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పలు అంశాలపై మాట్లాడారు. ఆయా జిల్లాల పరిధిలో ఉన్న రెవెన్యూ సమస్యలను ప్రస్తావించారు. 22ఎ జాబితా విషయంలో సడలింపులు తీసుకురావాలని, దేవాదాయ, ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్‌లు పి.గణబాబు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, సురేష్ బాబు, రఘురాజు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, సుందరపు విజయ్ కుమార్, బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పార్వతీపురం ఎమ్మెల్యే విజయ చంద్ర, శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గోండు శంకరరావు, నడుకూటి ఈశ్వరరావు, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి భాగస్వామ్యమయ్యారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణన్, పార్వతీపురం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల కలెక్టర్లు శ్యామ్ ప్రసాద్, స్వప్నిల్ దినకర్ పుండర్కర్, దినేశ్ కుమార్, బిఆర్.అంబేద్కర్, విశాఖ జెసి మయూర్ అశోక్, అనకాపల్లి జెసి జాహ్నవి, విశాఖపట్నం జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, పలువురు ఆర్‌డిఒలు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామ సచివాలయాల సిబ్బంది, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులకు జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ సుండం శ్రీనివాసు దొర మాట్లాడుతూ పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి కలిగిన, ఆరోగ్య వంతమైన, నీరు సమృద్ధిగా గల, పరిశుభ్రత, హరిత, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, సామాజికంగా సురక్షితం, సుపరిపాలన, మహిళ హిత ఇలా తొమ్మిది నిర్దేశికాలు ఆయా గ్రామాలలో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో అమలు పర్చితే పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధిస్తాయని తెలిపారు. దీనికి 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఆయా గ్రామ పంచాయితీల ప్రణాళికలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి బంధం శ్రీదేవి, జెడ్‌పిటిసి సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, డిఎల్‌డిఓ కోటేశ్వరరావు, సామర్లకోట పంచాయితీ రాజ్ శిక్షణ కేంద్రం ప్రతినిధి నిహారిక, పంచాయితీ విస్తారణాధికారి పద్మజ పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి- కూనవరం : రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, సిఆర్‌టిలను సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా అనంతపురం, గుంటూరు వంటి సుదూర జిల్లాలకు డిప్యూటేషన్లు వేయడం అన్యాయమని, తక్షణమే వారి డిప్యూటేషన్లు రద్దు చేసి, వారిని రిలీవ్ చేసి పాత పాఠశాలల్లో కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఎటిఎ జిల్లా అధ్యక్షులు సరియం అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఎటిఎ) ఉపాధ్యాయుల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక రకాల పాఠశాలలు ఉండగా ఐటీడీఏ పాఠశాలలోని ఉపాధ్యాయులను గురుకులాలకు డిప్యూటేషన్ వేయడం వలన ఆదివాసీ గిరిజన విద్యార్థుల విద్య కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భార్య పిల్లలను, కుటుంబాలను అర్ధాంతరంగా వదిలి డిప్యూటేషన్‌పై సుదూర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో పని చేస్తున్న సిఆర్‌టిల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. తక్షణమే డిప్యూటేషన్లను రద్దు చేయకుంటే దశల వారీగా పోరాటం చేస్తుందని, లీగల్ గా కూడా ప్రొసీడ్ అవుతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ముద్దాయికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం ఆర్‌వి.నగర్ వద్ద 2017 ఏప్రిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించిన ముద్దాయికి పదేళ్లు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ విశాఖపట్నం అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి తీర్పు వెల్లడించారు. జికె.వీధి సిఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం... 2017 ఏప్రిల్‌లో ఆర్‌వి.నగర్ వద్ద ఒక హోటల్‌పైకి లారీ దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో హోటల్‌లో ఉన్న ఆరుగురు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించి సంబంధిత లారీ డ్రైవర్ తరుణ్ హల్దార్‌పై కేసు నమోదు చేసి నాటి డిఎస్‌పి అనిల్ పూలపాటి కేసు ఇన్విస్టిగేషన్ చేశారు. ఎస్సై అప్పలసూరి కేసుకు సంబంధించిన సాక్షులను సకాలంలో విశాఖపట్నం సెషన్ కోర్టులో ప్రవేశ పెట్టారు. ఈ కేసులో వాదోపవాదనలు అనంతరం నేరం రుజువు కావడంతో ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా యమ్‌వి 35 తర్లకోట జిపి టౌన్‌కి చెందిన లారీ డ్రైవర్ తరుణ్ హల్దార్‌కు పదేళ్లు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గోవర్ధన్ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పిపి వాదించారు.

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు

వాహనాల నడిపే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని జీకే వీధి సిఐ వరప్రసాద్ హెచ్చరించారు. వాహనాల నడిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనాల్లో గంజాయి అక్రమ రవాణా చట్టరీత్య నేరమని, అటువంటి కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. డ్రైవర్లు లైసెన్సులు, వాహన ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఇతర పత్రాలు అప్ డేట్‌లో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధిలో కోడి పందేల స్థావరంపై సీలేరు పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. సీలేరు ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాలు ప్రకారం... దారకొండ పంచాయతీ పరిధిలో కోడిపందేలు జోరుగా సాగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సీలేరు ఎస్ఐ తమ సిబ్బందితో దాడులు చేశారు. కోడి పందెం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుండి 8 కోడి పుంజులు, రూ.11,600 స్వాధీనం చేసుకొని సీలేరు పోలీస్ స్టేషన్ తరలించారు. అనంతరం నిందితులను పెద్ద మనుషులు సమక్షంలో హెచ్చరించి విడిచి పెట్టినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కోడిపందేలు, జూదం చట్టరీత్యా నేరమని, మళ్లీ ఇటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు పరిశీలన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని ఎం.మాకవరం రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం ఏవో డి.ఉమాదేవి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ధాన్యం తేమ శాతం 17 శాతం మించకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్మును ఖాతాలో జమ చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఎ సంధ్యారాణి, వీఏఏ ఉషా తదితరులు పాల్గొన్నారు.